గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు

గుమ్మడిదల, జనవరి 22 : గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తిచేయడంతో పాటు నూతన పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో రూ. 20లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనం, రాంరెడ్డి బావి గ్రామంలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కానుకుంట గ్రామంలో నూతనంగా సీసీ రోడ్డు, యూజీడీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని కల్యా ణ రామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా పదేండ్లలో ప్రతి గ్రామా న్ని అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దామన్నారు.

రాబోయే రోజుల్లో ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సద్ది ప్రవీణా విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మంజులా వెంకటేశ్‌గౌడ్, జడ్పీటీసీ చిన్నపాపని కుమార్ గౌడ్, సర్పంచులు సుంకురేణుకాస్వామి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, వీరభద్రస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గటాటి భద్రప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్, సీనియర్ నాయకులు ఇందెల సురేందర్‌రెడ్డి, విశాల్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు పాల్గొన్నారు.


వీరారెడ్డిపల్లిలో నూతన పంచాయతీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

'మత్తు'పై ఉక్కుపాదం మోపాలి

ఎక్సైజ్‌శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహా

సంగారెడ్డి జనవరి 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ హరికిషన్, సహాయ కమిషనర్ రఘురాం ఇతర ఎక్సైజ్ అధికారులతో ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్తుపదార్థాల రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కృతనిశ్చయంతో ఉందన్నా రు. సంగారెడ్డి జిల్లాలో ఎక్కడా గుడుంబా, గంజాయి ఇతర మత్తుపదార్థాల రవాణా, విక్రయాలు జరుగకుండా ఉక్కుపాదం మోపాలని అధికారులకు సూచించారు. పోలీసు, ఎక్సైజ్‌శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లా అంతటా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఉర్సు

రాయికోడ్, జనవరి 22: మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సు నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. హస్నాబాద్‌లో ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న హజ్‌రత్ శంశీర్ దర్గా ఉర్సు సోమవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉర్సు నిర్వహించడం సంతోషకమన్నారు. హజ్‌రత్ శంశీర్ దర్గా అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. కుస్తీ పోటీలను తిలకించారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజుపాటిల్, మండల నాయకులు విఠల్, తుకారం, శంకర్, ఎంపీటీసీ నిరంజన్, సర్పంచులు హనుమంతు, ప్రవీణ్ కుమార్ నాగార్జున, దర్గా నిర్వాహకులు మల్లేశం కురుమ, సంగమేశ్వర్ ఉన్నారు.

కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు వెండి కడియం బహూకరిస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ సభలను విజయవంతం చేయాలి

జిన్నారం, జనవరి 22 : ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహా సభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కౌన్సిలర్ రాజారెడ్డి కోరారు. మండలంలోని కొడకంచి ప్రభుత్వ పాఠశాలలో టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను టీపీటీఎఫ్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కొడకంచి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌కుమార్, మండల టీపీటీఎఫ్ అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి వరప్రకాశ్, నాయకులు సామ్యనాయక్, వెంకటేశంగ, గిరిజ, విజయలక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జనవరి 22 : మండలంలోని సంజీవన్‌రావుపేట్ కొత్తపల్లి గ్రామానికి చెందిన బుజ్జమ్మకు మంజూరైన రూ.20వేల సీఎం సహాయనిధి చెక్కును సోమవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

కండ్లకు గంతలు కట్టుకుని శ్రీరాముడి విగ్రహం తయారీ

కండ్లకు గంతలు కట్టుకుని శ్రీరాముడి విగ్రహాన్ని తయారు చేస్తున్న శిల్పకారుడు డాక్టర్ హోతిబస్వరాజ్

న్యాల్‌కల్, జనవరి 22 : అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని కండ్లకు గంతలు కట్టుకుని శిల్పకారుడు శ్రీరాముడి విగ్రహాన్ని తయారు చేశారు. వివరాల్లోని వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన ప్రముఖ శిల్పకారుడు డాక్టర్ హోతి బస్వరాజ్ సోమవారం కండ్లకు గంతలు కట్టుకుని శ్రీరాముడి విగ్రహాన్ని తయారు చేయాలన్నదే సంకల్పంగా పెట్టుకున్నని శిల్పకారుడు బస్వరాజ్ పేర్కొన్నారు. అయితే అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నందున్న శ్రీరాముడి విగ్రహాన్ని తయారు చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. శ్రీరాముడిని తలచుకొని ఏకాగ్రతతో కేవలం 58 నిమిషాల్లో విగ్రహాన్ని తయారు చేసినట్టు చెప్పారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చేసిన రోజున కండ్లకు గంతలు కట్టుకొని స్వామివారి విగ్రహం తయారు చేసినందుకు సంతోషంగా ఉన్నదన్నారు.

జిన్నారం సర్పంచ్ రాజీనామా

జిన్నారం, జనవరి 22 : జిన్నారం సర్పంచ్ అంతిరెడ్డిగారి లావణ్యాశ్రీనివాస్‌రెడ్డి తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని కలెక్టరేట్‌లో డీఎల్‌పీవోకు అందజేశారు. తన వ్యక్తిగత కారణాలతో సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నానని, ఇందులో ఎవరి ప్రమేయంలేదని రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. జిన్నారంలో అర్ధరాత్రి మాజీ ఎంపీపీ పడకంటి వెంకటేశంగుప్తా విగ్రహాన్ని సర్పంచ్ ఏర్పాటు చేసి ప్రారంభించడంతో గ్రామస్తుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. అధికారులు విగ్రహాన్ని తొలిగించారు. దీంతో తన పదవికి లావణ్యాశ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేసినట్లుగా తెలుస్తోంది.


అందోల్ : రాములోరి పల్లకిమోస్తున్న ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

పటాన్‌చెరు : శ్రీరామమందిరం ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జహీరాబాద్‌లో నిర్వహించిన శోభాయాత్రలో బాల రాముడిగా బాలుడు

అంతా రామమయం

- అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ
- ఊరూరా పండుగ వాతావరణం
- ఆలయాల్లో పూజలు, అన్నదానాలు
- శోభాయాత్ర నిర్వహించిన భక్తులు

అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ఉదయం నుంచి హనుమాన్, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఊరూరా పండుగ వాతావరణం నెలకొంది. ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఎల్ ఈడీ స్క్రీన్‌పై అయోధ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించారు. కాషాయ జెండాలతో బైక్ ర్యాలీలు నిర్వహించారు. చిన్నారులు దేవతామూర్తుల వేషధరణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. - నమస్తే నెట్‌వర్క్, జనవరి 22

సంగారెడ్డి వైకుంఠపురంలోని శ్రీరాముడి భారీ చిత్రపటం

వట్‌పల్లి : నాగులపల్లిలో శ్రీరాముడి పల్లకీ ఊరేగింపులో గ్రామస్తులు

కొండాపూర్ : అనంతసాగర్ గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు

నారాయణఖేడ్ : రామాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

గుమ్మడిదల : కల్యాణ రామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో టీవీ స్క్రీన్‌లో ద్వారా అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠను వీక్షిస్తున్న భక్తులు

న్యాల్‌కల్ : కాకిజనవాడలోని శ్రీరామ మందిరంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుంటున్న భక్తులు

రామచంద్రాపురం : ఆర్సీపురంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

జిన్నారం : ఊట్ల గ్రామంలో రాముడి చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఝరాసంఘం : రామచంద్రప్రభు శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


కోహీర్ : దిగ్వాల్ సీతారామాంజనేయ ఆలయంలో హారతి ఇస్తున్న భక్తులు

దివ్యమంగళ స్వరూపుడు 'బాలరాముడు'

గుమ్మడిదల, జనవరి 22 : మానవ జన్మను పొందడం ఎంతో పుణ్యమని రంగంపేట మాధవానంద ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ అన్నారు. సోమవారం గుమ్మడిదల శ్రీకృష్ణానంద ఆశ్రమంలో ఆయన భక్తులకు సందేశమిచ్చారు. అయోధ్య దివ్య ధామంలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ప్రపంచదేశాలు వీక్షించడం చరిత్రాత్మకమన్నారు. నిత్యం రామనామాన్ని జపం చేసుకుందామని భక్తులకు సూచించారు.

విగ్రహం తొలిగింపు

జిన్నారం, జనవరి 22: జిన్నారంలో ఆదివారం అర్ధరాత్రి మాజీ ఎంపీపీ పడకంటి వెంకటేశంగుప్తా విగ్రహాన్ని అనుమతి లేకుండా ఏర్పాటు చేశారని అధికారులు సోమవారం తొలిగించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్, ఎస్సై విజయరావు, ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ సమక్షంలో పంచాయతీ సిబ్బంది విగ్రహాన్ని తొలిగించారు. విగ్రహం తొలిగిస్తున్న సమయంలో ఫిర్యాదుదారులను పోలీసులు ఆ ప్రాంతానికి అనుమతించలేదు.

అధికారుల సమక్షంలో విగ్రహాన్ని తొలిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మరిగమ్మ మోతీమాత జాతరకు సర్వం సిద్ధం

- 24న ఉప్పర్‌పల్లి తండాలో గిరిజన జాతర ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జాతరకు ముస్తాబైన ఉప్పర్‌పల్లితండాలో ఉన్న మోతీమాత ఆలయం

జహీరాబాద్, జనవరి 22 : గిరిజన అడవి బిడ్డలకు జాతర సంబురం వచ్చింది. కొండల్లో ప్రకృతిని ఆరాధిస్తూ జీవనాన్ని కొనసాగించే గిరిజన పుత్రులు మూడురోజులపాటు తమ కులదైవానికి ప్రత్యేక పూజలు చేస్తారు. తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి తరలివచ్చే అడవి బిడ్డలతో ప్రకృతి పులకించనున్నది. మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లితండా ఉన్న మరిగమ్మ మోతీమాత ఆలయం వేదిక కానున్నది. ఈ నెల 24,25,26న జాతరకు ప్రజాప్రతినిధు లు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉప్పర్‌పల్లితండాలో జాతర

మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో మూడురోజులపాటు మోతీమాత జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లలు లేని దంపతులు ఆలయానికి వచ్చి అమ్మవారిని మొక్కుకుంటే పిల్లలు పుడతారని గిరిజన పెద్దలు చెబుతున్నారు.

దీంతో కొత్తగా పెండ్లి అయిన వధూవరులు, రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వేలాది మంది గిరిజనులు తరలివచ్చి మోతీమాతను దర్శించుకుని పూజలు చేస్తారు. ఆలయ ఆవరణలో ఉన్న చెట్టుకు భక్తులు కొబ్బరికాయలు కడతారు. ఆలయ ఆవరణలో యజ్ఞ హోమాన్ని ఏర్పాటుచేసి పలు రకాల పూజలు చేయనున్నారు. జాతరలో తాగునీటి సదుపాయం, రోడ్లు, వైద్య శిబిరం, పారిశుధ్యం పనులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బేగంపేట్‌లో మహిళాసంఘ భవనం ప్రారంభం

కంది, జనవరి 22 : మండలంలోని బేగంపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని సర్పంచ్ రాజేందర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు సాయిగౌడ్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు భవనం లేక మహిళలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేయించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ రఘుగౌడ్, ఏపీఎం సమత, వార్డు సభ్యులు మల్లేశ్వరి, లావణ్య, అనిత, సరిత, వీవోల అధ్యక్షురాలు కృష్ణవేణి, నగేశ్ పాల్గొన్నారు.


మహిళా సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజేందర్‌నాయక్

నకిలీ విలేకరులపై కేసు నమోదు

జిన్నారం, జనవరి 22: ఇద్దరు నకిలీ విలేకరులపై జిన్నారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జిన్నారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు విలేకరులమని బెదిరించి ప్రభుత్వ ఎఫ్‌సీఐ బియ్యం లారీని ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. లారీ యజమాని ఆ వ్యక్తులను తన మొబైల్ ఫోన్‌లో ఫొటో తీసి జిన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై విజయరావు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇద్దరు వ్యక్తులు కూడా జిన్నారం గ్రామానికి చెందిన మంద శ్రీధర్, పుట్టి రమేశ్‌గా గుర్తించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బొల్లారం, జనవరి 22 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో రాష్ట్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి సోమవారం పర్యటించారు. కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కౌన్సిలర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్‌రెడ్డి, కాలనీవాసులు సతీశ్, సాయి, కన్నా, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

'గోదావరి' బాధ్యతల స్వీకరణ

కంది, జనవరి 22 : బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలుగా గోదావరీఅంజిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం కంది శివారులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధ్యతలు అప్పగించిన కేంద్ర, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, జగన్, రాజుగౌడ్, పోచారం రాములు పాల్గొన్నారు.